తొలి మెలకువ

— అరిగే రామారావు

మబ్బుల గొంగళిని మొకింత ప్రక్కకి వత్తిగిలించి చూచి, 'అరే చాలా ప్రొద్దెక్కిందే!' అనుకుంటూ సూర్యుడు బద్ధకంగా వళ్ళు విరుచుకున్నాడు.

ఎండ చురుక్కుమనేసరికి నరిసిమ్మకు గబుక్కున మెలకువ వచ్చింది. ఆవిలిస్తూ నులకమంచం దిగాడు. బద్ధకంగా వళ్ళు విరుచుకున్నాడు.

బయటికి వచ్చి గుడిశముందున్న మొండి గోడమీద కూర్చుంటూ "ఓలప్ప, కూసిని టీనీళ్ళు పెట్టే!" అన్నాడు.

తుమ్మచెట్టు క్రింద బొచ్చెలు తోముకుంటున్న రావులమ్మ "ఇదేవన్నా మీ బెజాడనుకున్నావా? మాం టీనీలూ, కాపీనీలూ ఎట్టుక్కోవూ తాగమూ!" అంది నిర్మొగమాటంగా.

"ఓలబ్బ గొప్పేలేవే! నాను నీ తోడబుట్టినోడ్ని, సుట్టపోడ్ని గందే! అప్పుడు మాడాలని బెజాడ నుంచి వచ్చాగందా, కూత్తంత మరేద సెయ్యడం లేదా?" దర్జాగా కాలువూగిస్తూ అన్నాడు.

"మాలావు సుట్టం వచ్చావులేగాని, ఒకేసారి వన్నం వండుతా, తిని బేగి బస్సెక్కి ఎల్లిపో!" అని విసుక్కుంది.

"మొత్తనికే మోసంగా వుందే!" అని గొణుక్కుంటూ వీథిలోకి వచ్చాడు.

టీ నీళ్ళకోసం వూరికే నాలిక పీకుతూంది, ఏటి సెయ్యటమా? అని బుర్ర గోక్కుంటుంటే వాళ్ళ సీతాలప్ప గుర్తుకు వచ్చింది. సీతాలప్ప వాళ్ళ చిన్నాయన కూతురు.

అక్కడ్నుంచి నేరుగా సీతాలప్ప గుడిసెకెళ్ళాడు.

నరిసిమ్మని చూచి "బత్తీమండెప్పుడు వచ్చావురా నర్సిమ్మా? బత్తీలో ఏం సేత్తున్నావు ఏందీ కతా?" అని ఆప్యాయంగా పలకరించింది.

"ఆకతంతా సెప్పాలంటే శానా వుందిగాని, బావయ్య ఏడీ కానరాటంలేదే?" అన్నాడు.

"కామందోరు కాడకు పొయ్యాడ్లేగాని కూకో!" అంటూ కుక్కి నులకమంచం వాల్చింది.

అటూ ఇటూ చూస్తూ యికిలిస్తూ పకిలిస్తూ "సీతాలప్ప, బత్తీతమ్ముడుకి టీనీళ్ళా, కాఫీనీళ్ళా ఏవీ లేవా?" అన్నాడు.

"ఏదో గంజినీళ్ళు తాగోళ్ళం! ఆ టీలూ, కాపీలూ మాకేం తెలుత్తాయిరా తమ్ముడూ? అస్సలయ్యి ఎట్టా ఎట్టుతారో కూడా తెల్దే మాకు?" అమాయకంగా అంది.

"ఓ అదా, ఎట్టా ఎట్టాలో నేనూపిత్తాలేగాని ముందు టీ పొడి గట్రా తెప్పించు!" అన్నాడు.

అంతలోకే సీతాలు ఏడేళ్ల కొడుకు కొండడు ముంజికాయ చిప్పతో తయార్జేసిన బండిని తాడుతో లాక్కుంటూ క్రిందకు జారిపోతున్న చెడ్డీని మాటిమాటికి పైకి లాక్కుంటూ వచ్చాడు.

క్రొత్త మనిషిని చూచి నిలబడిపోయాడు. గడ్డం క్రింద చెయ్యి వేసుకుని నరిసిమ్మ వంక ఆశ్చర్యంగా చూస్తూ నిలబడ్డాడు.

"వీడెవ్వడే సీతాలప్పా?"

"నీవెవరూ?" అని ఎదురు ప్రశ్న వేశాడు కొండడు.

"మా పోరడు. మాకుంది వీడొక్కడే!" అంది మురిపెంగా కొడుకు వంక చూస్తూ.

"వీడ్ని సూడంగానే అనుకున్నా వీడు మా మేనల్లుడని. నీ పేరేంట్రా అల్లుడూ?" నవ్వుతూ అన్నాడు.

"కొండడు. మరి నీ పేరేంటి?" అన్నాడు.

"ఓర్నీయమ్మ, ఈడు పెళ్ళికి పెళ్ళేత్తున్నాడే? ఒప్పప్పో, నీ కొడుకు గట్టోడేనే!" అన్నాడు.

సీతాలు కొడుకును దగ్గరకు తీసుకొని ప్రేమగా తల నిమురుతూ చిన్నగా నవ్వింది.

"అల్లుడూ నీకు కోమటి కొట్టు తెల్సంటరా?"

"బంగారు ప్పాన్ను బంగారయ్య కొట్టు నాకెరికే!"

"ఓలప్పో! ఈడు శానా వుశేరుగా వున్నాడే! మీ అమ్మకాడ డబ్బులు దీస్కొని ఆ బంగారప్పాన్నోడి కొట్టుకెళ్ళి ఒక టీపొట్లాం, సెటాకు పంచదారా- పంచదార లేకపోతే గింత బెల్లం గడ్డ తీసుకురా! ఆ సేత్తోనే సిన్న గలాసుడు పాలు కూడా పట్రా! ఇయ్యాళ మనం బెమ్మాండంగా టీ సేద్దాం, బేగెళ్ళిరా!" అని వుషారు చేశాడు.

కొండడు వాళ్ళమ్మకాడ డబ్బులు అడిగి పుచ్చుకొన్నాడు. చిన్న కారును స్టార్టు చేస్తోన్నట్టు ఎడం చేత్తో ముందుకూ వెనక్కి జరిపి కుడి చేత్తో హారన్ మ్రోగిస్తున్నట్టు 'పాయ్ పాయ్' అని అరుస్తూ నోటితో వింత వంత శబ్దాలు చేస్తూ వుషారుగా లగెత్తాడు.

"అరేయ్ అల్లుడూ, ఆ సేత్తోనే నాకు బీడీ కట్ట కూడా పట్రా!" వెనకనుంచి కేక పెట్టాడు.

ఇంతలో సీతాలు పొయ్యి రాజేసింది.

ఆపాటికి కొండడు కోమటి కొట్టుకాడ్నుంచి సరుకులన్నీ తెచ్చాడు.

...నరిసిమ్మ ప్రక్కన కూర్చొని సూచనలిస్తుండగా ఒక పెద్ద గిన్నెడు టీ తయారైంది.

నరిసిమ్మ ఆబగా టీ త్రాగుతూ కబుర్లు చెప్పసాగాడు. కొండడు గొంతుక్కూర్చొని చాక్కుతో టీ గ్లాసు పట్టుకొని నోటితో 'వుఫ్ వుఫ్' మని వూదుకుంటూ త్రాగుతున్నాడు.

వాడ్ని చూసి నవ్వుతూ "సీతాలప్పా, నీ కొడుకు పేకులాగా వున్నాడు. ఈడ్ని బళ్ళోకంపడం లేదా?" అన్నాడు.

ఆగూడెంలో కాదు గదా, అప్పలా పల్లెలోనే బడిలేదు. బడికెళ్ళాలంటే ఆరు మైళ్ళవతలవున్న 'కొత్త వూరు' వెళ్ళాలి. కొండడే కాదు ఆ గూడెంలో ఎవరి పిల్లలూ చదువుకోడం లేదు. ఆ గూడేన్ని ఆ సరస్వతీ దేవి కూడా వెలివేసింది!

కొండడి ఈడు పిల్లలందరూ బర్రెల్ని కాస్తారు. కొండడు కూడా వాళ్ళయ్య వచ్చేసే కామందుగారి గొడ్లను రోజూ అడివికి తోలుకుపోయి సాయంకాలం వరకు మేపి, సాయంత్రం వాట్నే చెర్వులో బాగా తోమి కడిగి తీసుకు వస్తాడు. అదే వాడి దినచర్య! చదువూ చట్టుబండలూ లేవు!

"పేకులాంటోడ్ని చదువూ సంధల్లేకుండా బర్రె గొడ్డుల్ని కాపిస్తున్నావా సీతాలప్పా! ఈడ్ని నా వెంట బస్తీకి పంపు. బస్తీలో శుభ్భ్రాంగా చది విత్తా! ఏరా, నా ఎంట బస్తీకొచ్చి ఆడ చదువుకుం టావా అల్లుడూ?" అని అడిగేడు.

కొండడు వుషారుగా "ఓ" అన్నాడు.

"అమ్మా నానూ బస్తీబళ్ళో చదుకుంటానే!" అని వాళ్ళమ్మ దగ్గర మారాం మొదలు పెట్టాడు.

"మనకెందుకురా కొండా ఈ చదువులు?" నిర్లిప్తంగా అంది.

"ఏంటప్పా అట్టాగంటావు? పేదలో పుట్టా మని బతికినంతకాలం మనం, మన పిల్లలూ, ఆళ్ళ పిల్లలూ-ఈ పేదే పిసుక్కుంటూ ఆ బర్రెల్నే కడుక్కుంటూ ఈ పేద బతుకులే బతకాలా? నేను బెజాడలో సూత్తున్నాముగా! ఆడ పిల్లలందరూ చదువుకునేవాళ్ళేగాని చదువుకోనోళ్ళు ఎవళ్ళూ వుండరూ! నా మాట విని కొండడ్ని కూడ బస్తీకి పంపించి చదివించు. అందరిమల్లే ఆడూ చదివు కుంటాడు. పెద్ద ఆఫీసరు అవుతాడు..."

నరసిమ్మ ఇలా చెప్తూంటే సీతాలు ఎక్కడో ఆలోచిస్తోంది.

కొండడు మళ్ళీ "అమ్మా, ఓలమ్మా! నానూ చదువుకుంటానే!" అని గొడవ చేయసాగాడు.

"మీ అమ్మ అట్టాగే అంటుందిగానీ నువ్ నాతో వచ్చేయరా కొండా!"

"నేనెళ్తా నేనెళ్తా!" కాళ్ళూ చేతులూ టప టపా కొట్టుకుంటూ గొడవ చేయసాగాడు.

"ఓరుండరా అట్టాగే ఎల్దువుగాని! నరసిమ్మా, నాకు తెలియక అడుగుతాగానీ బస్తీలో ఈడేడ వుంటాడు? ఏడ తింటాడు? ఆ కర్చు మన కలిసొచ్చే దేనా?" బోలెడు అమాయకంగా అడి గింది.

"ఓప్పదా నీ సంకోసం? ఇదివరకుమల్లే కాదప్పా! గవర్నమెంటోళ్ళు మనలాంటోళ్ళ పిల్లలు చదుకుంటానికి బస్తీలో ఆస్టళ్ళు పెట్టించారు. రెండు పూటలా తింటానికి కూడూ, చదుకో టానికి పుస్తకాలూ, కట్టటానికి బట్టా, కాక పై కర్చులకు నెలనెలా ఇంతని డబ్బూ అన్నీ ఆళ్ళే యిత్తారు."

"ఎట్టా?" నోటిమీద నేసుకుని ఆశ్చర్యంగా అంది.

"అవునే అప్పా! మన సేతికర్చు పైసా కూడా పెట్టక్కర్లేదు. కొండడ్ని నాతో పంపిత్తే సాలు. పెద్ద పెద్ద చదువులు చదివి సూటూ, బూటూ నేసుకొని మళ్ళీ ఆడు దొరబాబులాగా తిరిగి వత్తాడు. గంతే!"

"సర్లేరా, ఆళ్ళయ్యను కూడా కనుక్కొని అట్టాగే పంపిత్తా!"

"అయ్య వద్దంటాడే! అయ్యకి నీవ్వే సెప్పే! ఓలమ్మా నన్నంపే, బస్తీలో సక్కగా చదువుకుం టానే!" అంటూ వాళ్ళమ్మ భుజం మీద వాలి మారాం మొదలు పెట్టాడు.

"ఓరట్టాగే ఎల్దువుగాన్లేరా!" అంటూ కొడు కును వళ్ళోకి లాక్కొని ప్రేమగా ముద్దుపెట్టు కుంది.

"ఇయ్యాళ సాయంకాలం బస్సుకే నేనెళ్ళి పోతున్నా సీతాలప్పా! ఈ లోపల బావయ్యతో సెప్పి బుడ్డోడ్ని రెడీ సెయ్యి! మర్నేవాత్తా! వాత్తారా అల్లుడూ, నువు రెడీగా వుండు!" అని నరసిమ్మ వెళ్ళిపోయాడు.

వళ్ళో పడుకున్న కొడుకు తన చిన్న చేతుల్తో తన గడ్డం పట్టుకొని "అమ్మా, నేనెళ్తానే! నన్నంపే!" అని బతిమాలుతుంటే సీతాలు ఆలో చన్లో పడింది.

అప్పుడెప్పుడో చానేళ్ళ క్రింద పోలేరమ్మ జాత రకు కొత్త వూరెళ్ళినప్పుడు అక్కడ డేరా హాల్లో ఒక సినిమా చూసింది. ఆ సినిమాలో కూడా పాలేరు తనం చేసే చిన్న కుర్రాడు బస్తీకెళ్ళి చదువుకుం టాడు. తెల్లటి బట్టలు వేసుకొని సంచి భుజానేసు కుని బూట్లేసుకొని బడికెళ్ళుతాడు. మళ్ళీ అంత లోనే పెద్దోడు అయిపోతాడు. సూటూ బూటూ వేసుకుంటాడు. పెద్ద ఆఫీసరయిపోతాడు. కొడు కును చూసుకొని వాళ్ళమ్మ ఎంతో సంబరపడి పోతుంది. తన జన్మ ధన్యమైపోయినట్లు పొంగిపో తుంది-'అమ్మా!' అంటూ తల్లిని కౌగలించుకుం టాడు. అప్పుడా తల్లిని తన నెత్తిన బంగారు కుండలలో పైనుంచి దేవతలు అమృతం పోసినట్లు పరవశించిపోతుంది. ఆ సినిమా చూస్తున్నప్పుడు అను కుంది తనకు పుట్టే కొడుకును కూడా అలా చదివించి గొప్పోడ్ని చెయ్యాలని. ఆ తర్వాత ఆ సంగతే మర్చిపోయింది. మళ్ళీ ఈ రోజు ఈ నరసిమ్మ వచ్చి చెప్పాక ఆ పాత 'వూసు' మళ్ళీ యిప్పుడు గుర్తుకు వచ్చింది. ఆ పాతకోర్కె మళ్ళీ

తన గుండెల్లో జలజల లాడింది.

...(బతిమాలీ, బామాలీ, తగువులాడి ఎలా గైతేనేం మొగుడ్ని ఒప్పించి ఆ సాయంకాలమే కొండడ్ని నరిసిమ్మ వెంట బస్తీకి పంపించింది. విడిగా మరో చొక్కా లాగూ ఒక తుండు గుడ్డలో మూటకట్టి కొడుకు చేతికి యిచ్చింది. మొన్న తొలి ఏకాదశికి కొట్టిన పేలపిండిని ఒక కాగితంలో పొట్లం కట్టి 'ఆడ తినరా కొండా!' అని ఆ మూటలో పెట్టింది.

కొండడి తండ్రి బిచ్చాలు షావుకారుకాడ అప్పచేసి బస్సు చార్జీలకూ, దారి ఖర్చులకూ ముప్పై రూపాయిలు నరసిమ్మ చేతిలో పెట్టాడు.

బస్సెక్కపోయే ముందు సీతాలు కొడుకును ప్రేమగా దగ్గరికి తీసికొని బుగ్గలు పుణికి "అయ్యా కొండా, నీవు బత్తీలో బాగా సదుకొని దొరబాబు లాగా తిర్గి రావాలిరా అయ్యా!" అని కన్నీళ్ళు పెట్టుకుంది.

తన చిన్న చేతుల్తో తల్లి కన్నీళ్ళు తుడుస్తూ "అట్టాగేలేవే, నీవు ఏడమ్మాకే" అన్నాడు.

* * *

బస్సు వేగంగా పోతూంది.

కొండడు బస్సులో కిటికీ పక్క కూర్చున్నాడు. ఇళ్ళకు తిరిగిపోతున్న గేదెలూ ఆ గేదెల్నికాసే బుడ్డోళ్ళూ, తోటలూ, దొడ్లూ, తాడిచెట్లూ, చెర్వులూ, వాగులూ, వంకలూ ఒకదానివెంట ఒకటి వెనక్కి వెనక్కి పోతూంటే వేగంగా పోయే బస్సులోంచి ఈ దృశ్యాలన్నింటినీ చూడడం కొండడికి ఎంతో వింతగా, సరదాగా వుంది. అసలు బస్సెక్కటం వాడికదే మొదటిసారి. పక్కనున్న కొత్తవూళ్ళో జరిగే జాతర్లకు, సంతలకూ అప్పుడప్పుడూ తండ్రి వెంట వెళ్ళేవాడేగాని బస్సు మాత్రం ఎప్పుడూ ఎక్కలేదు. ఎప్పుడెళ్ళినా, ఎక్కడికెళ్ళినా వాళ్ళయ్య భుజాల మీదే కూర్చునే వాడు.

అమ్మడూ, అయ్యడూ పుట్టి పెరిగిన గూడెంకు దూరంగా వెళ్ళిపోవడం బాధగా వున్నా తాను బస్తీలో చదువుకోవటానికి పోతున్నాననే సంతోషం ముందు ఈ బాధ పెద్ద దిగులు అనిపించలేదు. వాడి ధ్యాసంతా బడి, పిల్లలూ, పల్లబోర్డూ, బోలెడు పుస్తకాలూ, ఆ పుస్తకాలన్నీ తను చదవటం-వీటి మీదే వుంది!

చల్లగా వీస్తోన్న గాలికి, బస్సు కుదుపుళ్ళకూ వాడికి తెలియకుండానే నిద్ర ముంచుకొచ్చింది... మళ్ళీ మెలకువ వచ్చి బయటికి చూసేసరికి బాగా చీకటి పడిపోయింది. వీధి దీపాలూ బస్సులూ, బుడ్డ కార్లూ, రిక్షాలూ మనుషులూ, షాపులూ కనిపిస్తున్నాయ్...

అంతలో బస్సు విజయవాడకు చేరుకుంది. ఒక సెంటర్లో ఆగింది అక్కడ వాళ్ళు దిగారు.

చిత్రం-వి. కృష్ణప్రియ-విజయవాడ

నరిసిమ్మ మావ తన చెయ్యి పట్టుకుని బాగా రద్దీగా వున్న ఆ సెంటర్లో నడిపించుకుంటూ ఎక్కడికో తీసుకు పోతున్నాడు. బట్టల మూటను చంకలో పెట్టుకుని మరో చేత్తో మావయ్య చెయ్యి పట్టుకొని నడుస్తోంటే ఎన్నో దుకాణాలూ, కళ్ళు మిరుమిట్లు కొల్పే దీపాలూ, బస్సులూ, పెద్ద పెద్ద మేడలూ కనిపించాయి. వీటన్నింటినీ చూడ్డం తన కెంతో వింతగా, చోద్యంగా వుంది.

తను వూరికే దిక్కులు చూస్తోంటే!, "ఒరరయ్, నడువురోయ్!" అన్నాడు మావ.

ఆ బజార్లుగుండా నడిచి నడిచి రైలు కట్టకేసి వచ్చారు. రైలు పట్టాలూ, పచ్చగా ఎర్రగా వున్న దీపాలూ కనిపిస్తోన్నాయి. దూరంగా రైలు కూతలు వినిపిస్తోన్నాయి. ఇంతలో దడదడా శబ్దం చేసుకుంటూ ఒక రైలుబండి ఆ పట్టాల మీద యమ స్పీడుగా వెళ్ళిపోయింది. ఆ రైల్ను తను నోరెళ్ళ పెట్టుకుని చూస్తూ నిలబడ్డాడు.

తనని అలా నడిపించి నడిపించి ఒక కాలువ గట్టు కేసి తీసికెళ్ళాడు. అక్కడ చీకటిగా వుంది. తనకెందుకో భయమేసింది. అంతలో చిన్నగుడిశలు కనిపించాయి.

ఒక గుడిశ ముందు ఆగి "మస్తాను వుండేదెక్కడ?" అని మావ వాకాబు చేశాడు.

ఇంకొంత దూరం నడిచాక ఒక గుడిశ ముందు ఆగారు. ఆ గుడిశ ముందేసిన నులక మంచం మీద ఒక మనిషి కూర్చుని మరో ఆడ మనిషితో వూసులాడుతున్నాడు. అతను నరిసిమ్మ మావను చూసి "ఎవరది?" అంటూ లేచివచ్చాడు. అతడు పొడుగు పంట్లాం, కురచ చేతుల రంగుల బనీనూ తొడుక్కున్నాడు. సిగరెట్టు తాగుతున్నాడు.

"నేనే మస్తానన్నా!" అంటూ మావ ముందు కెళ్ళాడు.

"నీవా, ఏంటి పనిమీద వచ్చావు?" అన్నాడు.

"వూర్లోంచి మా వాళ్ల బుడ్డోడ్ని తీసికొచ్చా!" అంటూ అతన్తో ఏదో మాట్లాడాడు.

తను ఆ ప్రక్కనున్న లైటుస్తంభం క్రింద ఒకదానిమీద ఒకటి పడుతూ లేస్తూ వుషారుగా గంతులేస్తోన్న రెండు కుక్కపిల్లల్ను సరదాగా చూస్తూ నిలబడ్డాడు.

ఆ మస్తాను తన దగ్గరకొచ్చి భుజంమీద వేశాడు నవ్వుతూ, "నీ పేరేనా కొండడు?" అన్నాడు. అవునన్నట్లు తాను తల వూగించాడు.

"నిన్ను అయిదరాబాదుకు తీసికెళ్లి అక్కడున్న గవర్నమెంటోళ్ల హాస్టల్లో జేరిపిస్తా. మరి బాగా చదువుకుంటావా?" అన్నాడు.

తను వుషారుగా తల వూగించాడు.

నరిసిమ్మ ఆ రాత్రి కొండడ్ని హోటల్‌కి తీసికెళ్ళి భోజనం పెట్టించాడు. కుర్చీలో కూర్చొని టేబిల్ మీద స్టీలు కంచంలో భోంచెయ్యాలంటే కొండడికి మహాయిబ్బందయిపోయింది. కుక్కిమంచంలోనో, వాళ్లమ్మ ఒడిలోనో, వాళ్ల గుడిశ ముందున్న మొండి గోడమీదనో కూర్చొని సత్తు బొచ్చెలో ఏ గంజినీళ్లో తాగి ఏ సంకటి కూడో తినేవాడు. ఆ లైట్లూ, ఆ సర్వర్లూ, కంచంలో అన్ని రకాల కూరలూ చూస్తోంటే బెరుకుతో, సిగ్గుతో అన్నం సరిగ్గా తిన్లేకపోయాడు.

హోటల్లో భోంచేశాక రైల్వే స్టేషను కెళ్లారు. స్టేషన్లో ఒక బెంచీమీద పడుకున్నారు. తన గుడ్డల మూటని తలక్రింద పెట్టుకున్నాడు. వచ్చేపొయ్యే రైళ్ల కూతలు వింటూ కళ్లు మూసుకున్నాడు. వెంటనే నిద్రపట్టలేదు. తల్లి గుర్తుకు వచ్చింది. తల్లి మెడను వాటేసుకొని వెచ్చగా, హాయిగా పడుకోవడం గుర్తుకువచ్చింది. కన్నీళ్లు వుబికాయి. గొంతులో ఏడ్పు సుళ్లు తిరిగింది. హైదరాబాదులో తాను చదువుకోవాలనే బలమైన కోర్కె మళ్లీ అంతలోకే ఆ కన్నీళ్లనూ, ఆ ఏడ్పునూ అదిమేసింది. అక్కడ తాను చదవబోయే చదువు గురించి రకరకాలుగా ఆలోచించుకుంటూ మెల్లగా నిద్రలోకి జారిపోయాడు...

నర్సిమ్మ మావ మళ్లీ చీకటితో లేపాడు. రైల్వే స్టేషను పంపు దగ్గర మొగాలు కడిగారు. మావ తనకు యిడ్లెన్లు పెట్టించాడు. కాఫీ యిప్పించాడు. ఇంతలోకి రాత్రి చూసిన మస్తాన్ వచ్చాడు. అతను భుజానికొక సంచి తగిలించుకున్నాడు.

దడదడా శబ్దం చేస్తూ రైలుబండి వచ్చి ఆగింది.



"అల్లుడూ, మన మత్తానన్న నిన్ను అయిదరాబాదులో హోట్టల్లో జేరిపిస్తాడు. బాగా సదువుకో!" అన్నాడు నరిసిమ్మ.

"నువ్వు రావా?" దిగులుగా అన్నాడు.

"నేనెందుకు రా, మన మత్తానన్న వున్నాడుగా! బెంగెట్టుకోమాకు. నేనప్పుడప్పుడు వచ్చి సూత్తుంటాలే!"

అంతలోకి రైలుబండి కదిలింది. మావ చెయ్యి వూపుతూంటే తనూ వూపాడు.

భయం భయంగా, బోలెడు మనాదీగా వుంది. మళ్లీ అంతలోకే వుషారు తెచ్చుకున్నాడు...

ఎదురు సీట్లో యించుమించు తనీడువాళ్లే యిద్దరు కుర్రాళ్ల కూర్చున్నారు. వాళ్ల మంచి బట్టలు వేసుకున్నారు. చొక్కాల్ని లాగుల్లోపల దోపి, పైన బెల్టులు పెట్టుకున్నారు. మేజోళ్లా బూట్లూ వేసుకున్నారు. వాళ్లిద్దరూ అన్నదమ్ముల్లాగా వున్నారు. వాళ్లకు పరీక్షలయిపోయినట్లున్నాయి. వాళ్లమ్మానాన్నలతో కలసి శలవుల్లో హైదరాబాదు చూడటానికి వాళ్ల బంధువులింటికి పోతున్నారు. ఆ పిల్లలు నవ్వుతూ తుళ్లుతూ వూరికే కాళ్ల వూగిస్తూ కామిక్స్ పుస్తకాలు చదువుకుంటున్నారు.

కొండడు ఆ యిద్దరు పిల్లల్నూ, వాళ్ల చేతుల్లో వున్న పుస్తకాలనూ మార్చి మార్చి చూస్తూ ఏవేవో వూహాలోకాల్లో విహరించసాగాడు... తాను కూడా ఈ పిల్లల్లాగా బళ్లో బోలెడు చదువుకొని, బాగా పరీక్షలు వ్రాసి శలవుల్లో యింటికి వెళ్లతాడు. అమ్మ తనని చూడగానే, 'మా అయ్యే, నా కొండే!' అని ముద్దులాడుతుంది. అయ్య తనని వళ్లో కూర్చోపెట్టుకొని, తాను బళ్లో నేర్చుకున్న పాఠాల్ని చదివి వినిపించుకొని మురిసిపోతాడు...

ఇలా వూహాలవుయ్యాల్లూగుతూ మెల్లగా చిన్న కునుకు తీశాడు...

** ** **

నాంపల్లి స్టేషన్లో దిగారు. రిక్షా ఎక్కారు.

ఆ రిక్షా పెద్ద పెద్ద బజార్లుగుండా పోయీపోయీ, చివరికి ఒక పెద్ద కాలనీలోకి మళ్లింది. ఆ కాలనీలో అన్నీ పెద్ద పెద్ద భవంతులున్నాయి.

ఒక పెద్ద బంగళా ముందు రిక్షా ఆగింది. తనను బయట వరండా మెట్ల దగ్గర నిలబెట్టి మస్తాను లోపలికెళ్లాడు.

వరండాలో గొలుసుతో కట్టేసి వున్న కుక్క భౌ భౌమని అరుస్తూ తన మీదకు దూకబోయింది. తనకు భయంతో లాగు తడిసిపోయేంత పనయింది!

మరి కాసేపటికి మస్తాను బయటికి వచ్చాడు. తనని లోపలికి తీసికెళ్లాడు.

ఒక లావుపాటాయన వాలుకుర్చీలో సుఖంగా కూర్చొని విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఆ గదిలో చాలా చల్లగా, హాయిగా వుంది.

మస్తాను తనని ఆయనకు చూపించి, "వీడే సాబ్! నేను వూర్నుంచి తీసికొచ్చిన కుర్రాడు. కొండా, అయ్యగారికి దణ్ణం పెట్టు! అయ్యగారూ, అమ్మగారూ చెప్పినట్లు వినుకోవాలి! బాగా సదువుకోవాలి! నేనప్పుడప్పుడు వచ్చి చూచిపోతుంటాలే!" అన్నాడు.

మస్తాను ఆ సాబ్‌కు వంగి వంగి దణ్ణాలు పెట్టి వెళ్లిపోయాడు.

ఆయన కొండడ్ని నఖశిఖపర్యంతం పరీక్షగా చూశాడు.

"నీ పేరేంటిరా?" అని అడిగాడు. తను చెప్పాడు.

ఆయన మళ్లీ "కాంతమ్మా!" అని పిలిచారు. లోపల్నుంచి ఒకామె వచ్చింది. "పిలిచారా అయ్యగారు?" నమ్రతగా అంది. హిందీలో ఆమెకేదో చెప్పారు.

కాంతమ్మ వాడ్ని లోపలికి తీసికెళ్లింది. తన చిన్న బట్టల మూటను చంకలో పెట్టుకొని బితుకు బితుకుగా ఆమె వెనకాల వెళ్లాడు. పెద్ద పెద్ద గదుల్లోంచి నడిపించుకొని ఒక దొడ్లోకి తీసికెళ్లింది.

ఆ దొడ్డి ఈ చివర్నుంచి ఆ చివరి వరకు వుంది. ఒక ప్రక్క వేపచెట్టు కూడా వుంది. దాని కిందే పంపు వుంది. ఆమె తనని ఆ పంపు కింద స్నానం చెయ్యమంది. స్నానం చేసి వచ్చాక వెనుక వరండాలో అన్నం వడ్డించింది. నేలమీద కూర్చొని అన్నం తిన్నాడు. ఆయమ్మ మంచావిడలాగే వుంది. కొసరి కొసరి వడ్డించింది. కడుపునిండా అన్నం తిన్నాడు.

"ఆ పళ్లెం గ్లాసు కడిగి అదిగో అక్కడ ఆ కిటికీలో పెట్టుకో!" అంది.

కంచం కడిగి ఆ కిటికీలో పెట్టాడు. తడి చేతులు లాగుకు పాముకున్నాడు.

దొడ్లో వేపచెట్టు గాలికి నిద్ర ముంచుకొచ్చింది. ఆ వరండాలోనే వత్తిగిల్లాడు. 'హోట్టల్లో మిగతా పిల్లోళ్ల ఏడా కానరాటం లేదేంటి! అంతా బళ్లల్లోకి పోయివుంటార్లే! ఆటలవీ ఆడి మళ్లీ సాయంకాలానికి పాలోమంటూ వత్తారు...' ఇలా అనుకుంటూ మెల్లిగా నిద్రలోకి జారిపోయాడు.

కాసేపు నిద్రపోయాడో లేదో కాంతమ్మ నిద్ర లేపింది.

"నీ పేరేంటి?" అంది.

ఆట్టలు పుత్తకాల్లో రాసుకుంటారేమో అనుకుంటూ, "కొండడండీ! మా అయ్యి పేరు బిచ్చాలు. మా అమ్మ పేరు సీతాలండీ!" అదేదో పాఠంలాగా అప్పజెప్పాడు.

ఆమె చిన్నగా నవ్వింది. తను సిగ్గుపడుతూ తల వంచుకున్నాడు.

"అదిగో ఆ పంపు కింద బొచ్చెలు వేశాను. అవన్నీ బాగా తోమి కడుక్కురా! అమ్మగారు నిద్దర లేస్తారు. ఆమెకు ఫలహారం తయార్జేసి ఛాయి పెట్టాలి!" అంటూ హడావుడిగా లోపలికెళ్లిపోయింది.

అటు చూశాడు, పంపు కింద బొచ్చెలు గుట్టగా పడేసి వున్నాయి.

చదువు చెప్పే ఆట్టల్లో పిల్లలచేత బొచ్చెలూ బోళ్లూ కూడా తోమిత్తారేమో అనుకున్నాడు..

"ఓ పిల్లోడా, యింకా మొదలుపెట్టలేదా? వాటితో నాకు చాల పనుంది. తొందరగా తోముకురా!

ఆ గూట్లో డబ్బాలో పొడి వుంది. అదేసి తోము!" లోపల్నుంచి కేకపెట్టింది.

ఆ కేకకు వులిక్కిపడ్డాడు. బొచ్చెలు తోమేడానికి సిద్ధమయ్యాడు.

ఆ గుట్టలో ఎంగిలి కంచాలూ, గ్లాసులూ, గరిటలూ, ప్లేట్లూ, పెద్ద పెద్ద కూరగిన్నెలూ, డెగిశాలూ, నానా రకాల బొచ్చెలూ వున్నాయి. తనకయితే బర్రెగొడ్లను తోమి తోమి కడగటం వచ్చుగానీ ఈ బొచ్చెలూ బోళ్లూ తోమటం రాదు. తన తల్లి తనచేత ఎప్పుడూ ఇలాటి పన్లు చేయించలేదు.

తల్లి బొచ్చెల్ని ఎలా కడిగేదో గుర్తుకుతెచ్చుకుంటూ తన చిన్న చేతుల్తో వాట్నే తోమే ప్రయత్నంలో వున్నాడు.

మధ్యలో కాంతమ్మ వచ్చింది. "ఏరా కొండయ్యా, నీకు బొచ్చెలు కడగడం రాదా?" అంది. అవునన్నట్లు తల వూపాడు. పక్కన నిలబడి ఎలా తోమాలో సూచనలిస్తోంది.

ఇంతలో లోపల్నుంచి మరొకామె వచ్చింది. ఈమె ఖరీదైన చీరకట్టి, మనిషి డాబుగా, హుందాగా వుంది. 'అమ్మగారు' అంటే ఈమే కాబోలు!

అప్పటివరకు ఫ్యానుగాలి క్రిందా, మెత్తటి పరుపుమీదా సుఖంగా నిద్రపోయి వచ్చిందల్లే వుంది మొగం వుబ్బి నిగారింపుగా వుంది.

ఆమె, "కాంతమ్మా, ఈ కుర్రాడు ఎలా పన్జేస్తోన్నాడు?" అని అడిగింది. ఆమె గొంతు కూడా హుందాగా వుంది.

కొండడు తల ఎత్తి ఆమెను చూశాడు.

"కొత్తకదమ్మగారూ! దగ్గరుండి నేర్పిస్తే రెండు రోజుల్లో నేర్చుకుంటాడు" అంది కాంతమ్మ. ఆమె ఆ యింట్లో వంటాబిడ; కొండడికి వాళ్ల మాటలు కొంచెం కూడా అర్థం కావటం లేదు. 'మరి అసలు సదువెప్పుడు నేర్పితారో!' అనుకున్నాడు.

"ఈ హైదరాబాదులో ఎంత డబ్బు పోసినా



సరీగ్గా చేసే పనివాళ్లు దొరకటం లేదు. ఊరికే నాగాలు పెడతారు. ఒక్కొక్కళ్లు నాలుగైదు యిళ్లు వప్పుకుంటారు. వీళ్లతో పడలేకుండా వున్నామని అయ్యగారు వీడ్ని పల్లెటూర్నుంచి తెప్పించారు. మనింట్లోనే పర్మనెంట్‌గా పడి వుంటాడు. అన్ని పన్లూ చేస్తాడు..." అంది.

"మరేనమ్మగారు!"

"... వీడికి అన్నం పెట్టి, బట్టలిచ్చి, సంవత్సరానికి వెయ్యి రూపాయిలు యివ్వాలంట..."

కొండడి చేతులు గిన్నెల్ని రుద్దడం ఆపేసాయి. ఎత్తిన తల అలాగే వుంది. బిత్తరపోయి చేష్టలుడిగి ఆ 'అమ్మగారి మాటలే వింటున్నాడు...

"... వీళ్ల వాళ్లకివ్వాలని, చార్జీలకనీ, దానికనీ దీనికనీ వీడ్ని తీసికొచ్చినవాడు అయ్యగారిదగ్గర ముందే రెండు వేల దాకా తీసుకుపోయాడంట!.."

వేపచెట్టు మీది కాకులు గోల గోలగా అరవటం మొదలుపెట్టాయి.

'ఇదంతా దగా—పచ్చిమోసం—ద్రోహం—' అంటున్నాయా అన్నట్లు ఆ కాకులు ఆపకుండా గోలగా, వూరికే అరుస్తోన్నాయి!

మరి ఈ దగా ఎవరు చేశారు? ఈ పచ్చి మోసం ఎవరు చేశారు? ఈ ద్రోహం ఎవరు చేశారు?

నరిసిమ్మ మావ చేశాడా?

ఈ మస్తాను చేశాడా?

డబ్బులకాశపడి తన అయ్య చేశాడా?

డబ్బుకు కక్కుర్తిపడి తన తల్లే చేసిందా?

అంటరానివాడని కంటగించుకొని ఆ చదువుల తల్లి సరస్వతే చేసిందా?

కొండడి చిన్నారి మనస్సుకు ఇది అంతుపట్టని ప్రశ్నే! వాడి లేత వెన్నుకు ఇది పిడిబాకు పోటు!

కాకులింకా అరుస్తోనే వున్నాయి...

ప్రభుత్వ మరియు ప్రైవేట్ స్కూల్, కాన్వెంటు టీచర్స్‌కు శుభవార్త!



మహారాజ
కాంచన్
సోనాలి
బట్టర్‌ఫ్లై
ప్రీతి

మిక్సీలు, వెట్‌గ్రైండర్స్ మరియు ఇతర గృహోపకరణములు
వడ్డీ లేకుండా
సులభవాయిదా పద్ధతిలో!
త్వరపడండి!

ఫోన్: 66322

సాగర్ ఎలక్ట్రికల్ & ఎలక్ట్రానిక్స్

బకింగ్‌హాం పోస్టాఫీసు వద్ద, గూడవల్లివారివీధి, గవర్నర్‌పేట, విజయవాడ-520002